సాక్షి ఖమ్మం

గురువారం । 20 । మార్చి । 2025



విద్యుత్ చార్జీల పెంపు లేదు..

వచ్చే ఆర్థిక సంవత్సరం విద్యుత్ చార్జీల టారిఫ్ పెంపుదలపై ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి వెల్లడించారు. IIలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం సా॥) 6.26

సహర్ (శుక్రవారం ఉ॥) 4.56

వాతావరణం

గరిష్టం / కనిష్టం 38° / 22°

జిల్లాలో గురువారం రోజంతా ఉష్ణోగ్రతలు ఎక్కువగానే ఉంటాయి. రాత్రి మాత్రం వాతావరణం చల్లబడే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు పెనుబల్లి మండలం రామచంద్రాపురంలో ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం 12గంటలకు కల్లూరు మండలం పెద్ద కోరుకోండిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, 12–30గంటలకు ఎర్రబోయినపల్లిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం సాయంత్రం 4గంటలకు తిరుమలాయపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశాక పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభిస్తారు. అలాగే, 5గంటలకు తెట్టెలపాడు, మేడిదపల్లి, ఇస్లావత్ తండాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారు.

కలెక్టరేట్‌లో హౌస్ కీపింగ్‌కు టెండర్ల ఆహ్వానం

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లో పారిశుద్ధ్యం, హౌస్ కీపింగ్ నిర్వహణను సాయినాథ్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించగా కార్మికుల వేతనాల్లో కోతలు విధిస్తుండడంపై ఈనెల 11న 'సాక్షి'లో 'కార్మికుల కష్టం కాజేస్తున్నారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్... గత 28వ తేదీతోనే ఏజెన్సీ కాల పరిమితి ముగిసిన నేపథ్యాన పొడిగించకుండా మళ్లీ టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. ఈమేరకు కలెక్టరేట్ పరిసరాలు, అన్ని కార్యాలయ గదులను పరిశుభ్రం చేయడం, టాయిలెట్లు, కారిడార్, గార్డెన్ నిర్వహణ కోసం ఆసక్తి ఉన్న హౌస్ కీపింగ్ సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానిస్తూ అధికారులు ప్రకటన విడుదల చేశారు. రూ.10వేల నగదు చెల్లించి టెండర్ ఫారాలు తీసుకుని, ఈనెల 27న సాయంత్రం 5గంటల్లోగా టెండర్లు దాఖలు చేయాలని సూచించారు. టెండర్‌తో పాటు కలెక్టర్ పేరిట రూ.3,00,300 చొప్పున డీడీ లేదా చెక్కు రూపంలో అందించాల్సి ఉంటుందని, వివరాలకు 98499 06076 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పోస్టు ద్వారా సీతారాముల కల్యాణ తలంబ్రాలు

ఖమ్మంగాంధీచౌక్: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో వచ్చేనెల 6న శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం జరగనుంది. ఈమేరకు నేరుగా హాజరుకాలేని భక్తుల ఇంటికే కల్యాణ తలంబ్రాలు అందించాలని పోస్టల్ శాఖ నిర్ణయించింది. అంతరాలయ అర్చన, కల్యాణ తలంబ్రాల కోసం రూ.450, ముత్యాల తలంబ్రాల కోసం రూ.150ను సమీప పోస్టాఫీస్‌లో లేదా పోస్టుమ్యాన్‌కు చెల్లిస్తే కల్యాణం ముగిశాక ఇంటి వద్దకే తలంబ్రాలు చేరవేస్తామని ఖమ్మం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ వి.వీరభద్ర స్వామి తెలిపారు. ఈమేరకు భక్తులు ఏప్రిల్ 1వ తేదీ వరకు రుసుము చెల్లించాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

ఎక్కడా ఎరువుల కొరత లేదు..



రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

కామేపల్లి: రైతులు సాగు చేస్తున్న యాసంగి పంటలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య తెలిపారు. కామేపల్లి మండలం కామేపల్లి, కొండాయిగూడెం సొసైటీ కార్యాయాల్లో ఎరువులు, రికార్డులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో అన్ని పీఏసీఎస్‌ల్లో సరిపడా యూరియా అందుబాటులో ఉందని, రైతులు అధికారుల సిఫారసు మేరకే వినియోగించాలని సూచించారు. కాగా, డీలర్లు స్టాక్ వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలని, నానో యూరియా, నానో డీఏపీ వాడకంతో ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఏఓ తారాదేవి, ఏఈఓలు ఉష, జగదీశ్వర్, శ్రీకన్య పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు 18,165మంది విద్యార్థులకు గాను 17,515మంది హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. కాగా జిల్లాలోని 40పరీక్ష కేంద్రాలను హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయని వెల్లడించారు.

ప్రాజెక్టుల్లో వరద పారేలా...



సాగునీటి ప్రాజెక్టుల పనులు వడివడిగా సాగేలా రాష్ట్ర బడ్జెట్‌లో దండిగా నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లాకు వరప్రదాయినిగా నిలిచే సీతారామ ప్రాజెక్టుకు రూ.699.35 కోట్లు కేటాయించగా.. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఊతమిచ్చేలా కేటాయింపులు చేశారు. అలాగే, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణం, ఎకో టూరిజం, ఇతర సంక్షేమ పథకాల కొనసాగింపునకు ప్రత్యేకంగా నిధులు కేటాయించగా.. ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చినట్లయింది.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

రాష్ట్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత

- సీతారామ'కు రూ.699.35 కోట్లు కేటాయింపు
- వైరా ప్రాజెక్టు, ఎర్రుపాలెం ఎత్తిపోతలకు కూడా..
- వ్యవసాయ ఆధారిత పరిశ్రమల నిర్మాణానికి ఊతం
- ఎకో టూరిజం, సంక్షేమ పథకాల అమలుకు చర్యలు

ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులకు గత ఏడాది, ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపులు

ప్రాజెక్టు	గత ఏడాది	వ్యయం	ప్రస్తుతం
సీతారామ ప్రాజెక్టు	రూ.799.43కోట్లు	రూ.799.43కోట్లు	రూ.699.35కోట్లు
భక్తరామదాసు	రూ.50.15 లక్షలు	రూ.50.15లక్షలు	రూ.9 లక్షలు
ఎర్రుపాలెం (ఎల్‌ఐ)	రూ.500 కోట్లు	రూ.500 కోట్లు	రూ.39.90 కోట్లు
లంకాసాగర్	రూ.5 కోట్లు	రూ.5కోట్లు	రూ.లక్ష
వైరా ప్రాజెక్టు	రూ.14.49 కోట్లు	రూ.14.49 కోట్లు	రూ.10 కోట్లు
తాలిపేరు	రూ.52 లక్షలు	రూ.52లక్షలు	రూ.7.30 కోట్లు
కిన్నెరసాని	రూ.లక్ష	రూ.లక్ష	రూ.13.33 కోట్లు

దశల వారీగా ఇళ్లు

బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.305.03 కోట్లు కేటాయించడమే కాక గత ప్రభుత్వ హయాంలో సగం మేర పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సైతం పూర్తి చేస్తామని ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. దీంతో జిల్లా నుంచి ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో సంతోషం వ్యక్తమవుతోంది. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 3,57,869 దరఖాస్తులు అందగా, ఇప్పటికే గ్రామసభల ద్వారా అర్హులను గుర్తించారు. ఇక డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి జిల్లాలో 5,939 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఇందులో 5,501 ఇళ్లను కేటాయించిన నేపథ్యాన మిగతా వాటి పనులు కూడా పూర్తిచేయనున్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు ప్రోత్సాహం

సంప్రదాయ బదులు ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం రైతులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు భట్టి తెలిపారు. ఆయిల్ పామ్ దిగుమతిపై కస్టమ్స్ సుంకం విధించడంతో ఇక్కడ రైతులకు టన్నుకు రూ.2వేల మేర అదనపు లబ్ధి చేకూరనుంది. అలాగే, ఉద్యానవన సాగులో బిందు సేద్యం, సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తామని వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో ఆయిల్ పామ్ 82 వేల ఎకరాల్లో సాగవుతుండగా, ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు లబ్ధి జరగనుంది.

వడివడిగా 'సీతారామ'

ఉమ్మడి జిల్లాలోని ఆయకట్టుకు సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టుకు గత బడ్జెట్((ఖమ్మం సీఈ పరిధి)లో రూ.687.81 కోట్లు, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఎస్టాబ్లిష్‌మెంట్ అండ్ యాప్ వర్క్స్ ద్వారా రూ.111.62 కోట్లు కేటాయించగా.. ఆ మొత్తం ఖర్చుచేశారు. ఈసారి బడ్జెట్‌లో ప్రాజెక్టుకు రూ.643.04 కోట్లు, యాప్ వర్క్ ద్వారా రూ.56.31 కోట్లు కేటాయించడం విశేషం. ఇటీవలే ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన అంచనా వ్యయం రూ.19,324 కోట్లకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇక భక్త రామదాసు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు మాత్రం గత బడ్జెట్‌లో రూ.50.15 లక్షలు కేటాయించిన ప్రభుత్వం ఈసారి కేవలం రూ.9 లక్షలకే పరిమితమైంది.

ఎర్రుపాలెం లిఫ్ట్‌కు నిధులు

సాగర్ కాల్వపై నిర్మించే ఎర్రుపాలెం వద్ద ఎత్తిపోతల పథకానికి గత ఏడాది శంకుస్థాపన జరిగింది. ఈ పథకానికి గత ఏడాది రూ.500కోట్లు కేటాయించగా ఈసారి మరో రూ.39.90 కోట్లు కేటాయించారు. అలాగే, లంకాసాగర్ ప్రాజెక్టుకు ఈదఫా రూ.లక్ష మాత్రమే కేటాయింపులు జరిగాయి. వైరా ప్రాజెక్టుకు గత ఏడాది రూ.14,49,85,000 కేటాయించగా.. ఈసారి రూ.10 కోట్లు కేటాయించారు. తాలిపేరు ప్రాజెక్టుకు గత బడ్జెట్‌లో రూ.52 లక్షలు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో రూ.7.30 కోట్లు, కిన్నెరసాని ప్రాజెక్టుకు రూ.13.33 కోట్లు కేటాయించారు.

మహిళా శక్తికి ఊతం

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు, ఆర్టీసీ బస్సుల కేటాయింపు తదితర అంశాల్లో ప్రాధాన్యత కల్పిస్తుండగా ఇప్పటికే జిల్లాలో 22 స్త్రీ టీ క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. ఈసారి బడ్జెట్‌లోనూ మహిళా శక్తి పథకానికి కేటాయించిన నిధులతో జిల్లాలో మరింత మందికి అవకాశం దక్కనుంది.

విద్యారంగానికి..

అన్ని సౌకర్యాలతో కూడిన భవనాలు, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య బోధించాలనే ఉద్దేశంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అలాగే, జిల్లాలో వివిధ సంక్షేమ శాఖల ద్వారా కొనసాగుతున్న 37 గురుకులాల్లో కొన్నింటికి సొంత భవనాలు లేవు. దీంతో ప్రభుత్వం ఏర్పాటుచేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల భవనాలకు బడ్జెట్‌లో రూ.11,600 కోట్లు కేటాయించడంతో జిల్లాలోనూ ఈ పనులు చురుగ్గా కొనసాగనున్నాయి.

సన్నాలకు బోనస్..

వ్యవసాయ రంగానికి ఈ బడ్జెట్‌లో రూ.24,439 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం గత ఏడాది సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో జిల్లాలో ఆ రకం సాగు పెరిగింది. ప్రస్తుతం యాసంగితో పాటు వచ్చే వానాకాలం కూడా బోనస్ ఇవ్వనుండగా జిల్లా రైతులకు లబ్ధి జరుగుతుంది. ఇక ఖమ్మంను వ్యవసాయాధారిత పరిశ్రమలు, తయారీ రంగానికి కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆర్థికశాఖ మంత్రి భట్టి ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో మిర్చి, పత్తి, మొక్కజొన్న, మామిడి, పామాయిల్, బొప్పాయి, కూరగాయలు సాగు చేస్తున్న రైతులకు లాభం జరిగేలా పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి.

అటవీ అభివృద్ధి.. టూరిజం

పర్యాటక శాఖకు బడ్జెట్‌లో రూ.776 కోట్లు కేటాయించారు. దీంతో జిల్లాకు నిధులు రానుండగా నేలకొండపల్లి బౌద్ధక్షేత్రం, పాలేరు రిజర్వాయర్, కిన్నెరసాని రిజర్వాయర్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దనున్నారు. అలాగే, పులిగుండాల అడవుల్లో ఎకో టూరిజం అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అడవుల అభివృద్ధికి రూ.1,023 కోట్లు కేటాయించిన నేపథ్యాన జిల్లాలోనూ అటవీ ప్రాంత అభివృద్ధికి అడుగులు పడనున్నాయి.

ఖమ్మం, సత్తుపల్లిలో మోడల్ వైకుంఠధామాలు

ప్రణాళికలపై మంత్రి తుమ్మల సమీక్ష



మహాప్రస్థానం నమూనాలు పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: మనిషి చివరి మజిలీ అయిన మహాప్రస్థానాలకు వచ్చే మృతుల బంధువులకు ఓదార్పునిచ్చేలా అన్ని సౌకర్యాలతో నిర్మించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైకుంఠధామాల నిర్మాణాలపై హైదరాబాద్‌లో బుధవారం ఆయన సమీక్షించారు. ఖమ్మం, సత్తుపల్లిలో మోడల్ వైకుంఠధామాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కేఎంసీ, సత్తుపల్లి కమిషనర్లు అభిషేక్ అగస్త్య, నరసింహను ఆదేశించారు. ఈసందర్భంగా కన్సల్టెన్సీ ప్రతినిధులు మోడల్ వైకుంఠధామాల నిర్మాణంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా, సూర్యాపేట, నల్లగొండలో ఇప్పటికే పూర్తయిన నిర్మాణాలను పరిశీలించాలని సూచించారు. ఆపై భూకేటాయింపు, నిధుల విడుదలపై దృష్టి సారించాలని మంత్రి తెలిపారు.

ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

ఇఫ్తార్ విందులో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



కలెక్టర్‌కు పండు తినిపిస్తున్న మంత్రి, పక్కన సీపీ

ఖమ్మంరూరల్: ఏటా రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు ఆత్మీయత, మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురంలో పాలేరు నియోజకవర్గ ముస్లింలకు బుధవారం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ పాల్గొనగా మంత్రి మాట్లాడారు. రంజాన్ మాసంలో భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్ష ఆచరించే ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. కాగా, నియోజకవర్గంలోని ఒక్కో మసీదు అభివృద్ధి, ఇతర పనులకు రూ.లక్ష చొప్పున మంజూరు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. తాజాగా ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ముస్లిం మైనార్టీలకు సైతం లబ్ధి జరుగుతుందని తెలిపారు. కాగా, గత ఏడాది మున్నేటికి వరదలు వచ్చిన సమయాన ప్రకాశ్‌నగర్ బ్రిడ్జిపై చిక్కుకున్న పలువురిని తన ప్రాణాలు ఫణంగా పెట్టి రక్షించిన సుభానీని మంత్రి అభినందించారు. ఈకార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, చావా శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి..



విద్యార్థిని ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

- ప్రతీ విద్యార్థి ఆంగ్లంపై పట్టు సాధించాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కొణిజర్ల: పదో తరగతి బాలబాలికలు ఆందోళన, భయం విడనాడి ప్రశాంత వాతావరణంలో వార్షిక పరీక్షలు రాయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. మండలంలోని తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బుధవారం వచ్చిన ఆయన పదో తరగతి విద్యార్థులకు సూచనలు చేశారు. పౌష్టికాహారం తీసుకుంటూ శ్రద్ధగా చదవాలని, తద్వారా పరీక్షల్లో మంచి మార్కులు సాధించొచ్చని తెలిపారు. అనంతరం అదే పాఠశాలలో 'వుయ్ కెన్ లెర్న్' పేరిట నిర్వహిస్తున్న ఆంగ్లభాషా శిక్షణను కలెక్టర్ పరిశీలించారు. బాలబాలికలకు గ్రూపులుగా ఏర్పరిచి ఆంగ్లంలో మాట్లాడించారు. నాలుగు నెలల్లో మంచి మార్పు కనిపిస్తున్నందున విద్యార్థులంతా ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని సూచించారు. తొలుత తనికెళ్ల సెంటర్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ ఏ.రోజారాణితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. తహసీల్దార్ రాము, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం డి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ పనుల్లో వేగం

ఖమ్మంఅర్బన్: మున్నేటి వరదకు అడ్డుకట్ట వేసేలా నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్‌కు భూసేకరణతో పాటు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి పోలేపల్లి వద్ద రిటైనింగ్ వాల్ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రోజువారి లక్ష్యాలను నిర్దేశించుకుని పనులు చేపట్టాలని, ఈ గోడ నిర్మాణానికి కావాల్సిన భూముల సేకరణకు నిర్వాసితులతో చర్చించాలని తెలిపారు. నిర్వాసితులకు అభివృద్ధి చేసిన భూములను ప్రత్యామ్నాయంగా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. జలవనరులశాఖ ఎస్‌ఈ మంగళపుడి వెంకటేశ్వర్లు, డీఈ రమేష్‌రెడ్డి, మన్మధరావు, తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఆర్‌ఐ క్రాంతి పాల్గొన్నారు.

ఐక్యరాజ్య సమితి సదస్సులో జిల్లా వాసి

'మహిళా సాధికారత'పై మాట్లాడిన సునీత



వివిధ దేశాల ప్రతినిధులతో సునీత (ఎడమ నుంచి మూడో వ్యక్తి)

ఖమ్మం మామిళ్లగూడెం: న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో 'మహిళల సాధికారత – సామాజిక స్థితిగతులు' అంశంపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో ఇంటర్నేషనల్ కమిషన్ ఆఫ్ కల్చర్ అండ్ డిప్లొమాటిక్ రిలేషన్స్ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్, ఖమ్మంకు చెందిన డాక్టర్ ఏలూరి సునీత పాల్గొన్నారు. మహిళా సాధికారతను సమర్థించడం, ఆధునిక సాంకేతికత ఉపయోగాన్ని మెరుగుపర్చడం తదితర అంశాలపై ఆమె కీలక సూచనలు చేశారు. అలాగే, మహిళలు ఎదుర్కొంటున్న సైబర్ వేధింపులు, డిజిటల్ అసమానతలు, ఆన్‌లైన్ భద్రతా సమస్యల పరిష్కారంపైనా మాట్లాడారు. మహిళల ఆరోగ్యం, మాతృత్వ సంరక్షణ, శిశు సంక్షేమం, లింగ సమానత్వం కోసం పకడ్బందీ చర్యలు చేపట్టాలని, లింగ సమానత్వంపై విద్యార్థి దశలోనే అవగాహన పెంచేలా విద్యావ్యవస్థలో కోర్సులు ప్రవేశపెట్టాలని సూచనలు చేశారు. కాగా, మహిళా సాధికారతకు అనుకూలమైన విధానాలను ప్రోత్సహించేలా అన్ని దేశాల బాధ్యులు పరస్పర సహకారం అందించుకోవాలని ఈ సమావేశాల్లో నిర్ణయించినట్లు ఆమె తెలిపారు.


తెరపైకి వ్యవసాయాధికారుల పదోన్నతులు

ఉమ్మడి జిల్లాలో పాలనాపరమైన మార్పునకు అవకాశం

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ శాఖలో పదేళ్లకు పైగా ఎదురుచూస్తున్న పదోన్నతుల వ్యవహారం తాజాగా తెరపైకి వచ్చింది. సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) మొదలు ఆపై స్థాయి అధికారులకు ఉద్యోగోన్నతి కల్పించే వ్యవహారాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఏడీఏలకు డీడీఏ(డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్)లుగా, డీడీఏలకు జేడీఏ(జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్)లుగా, జేడీఏలకు అడిషనల్ డైరెక్టర్ హోదాలో పదోన్నతి కల్పించనున్నట్లు సమాచారం. వ్యవసాయ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి విదేశీ పర్యటనలో ఉండగా, ఆ అధికారి వచ్చాక ప్రక్రియ పూర్తయ్యే అవకాశముందని తెలిసింది. ఇందులో భాగంగా గతంలో ఇక్కడ జిల్లా వ్యవసాయాధికారిగా పనిచేసిన అధికారికి జేడీఏగా పదోన్నతి లభించనుందని, ఆపై ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి పోస్టు జేడీఏ స్థాయి కావడంతో ఆ ఉద్యోగిని ఇక్కడ నియమిస్తారని సమాచారం. అలాగే, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఏడీఏలకు డీడీఏలుగా, ఒకరిద్దరు ఏఓలకు ఏడీఏలుగా పదోన్నతులు లభించనున్నాయని వ్యవసాయ శాఖలో చర్చ జరుగుతోంది. తద్వారా ఉమ్మడి జిల్లాలో పాలనాపరమైన మార్పులు జరిగే అవకాశముందని చెబుతున్నారు.

పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు
- జిల్లాలో 97 కేంద్రాలు, 16,788మంది విద్యార్థులు
- ఈసారి అడిషనల్స్‌కు బదులు బుక్‌లెట్



ఖమ్మంసహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం మొదలుకానున్నాయి. ఈమేరకు ఈనెల 21నుంచి వచ్చేనెల 4వ తేదీ వరకు జరిగే పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. జిల్లాలో పరీక్షల నిర్వహణకు చేసిన ఏర్పాట్ల వివరాలను డీఈఓ సోమశేఖరశర్మ బుధవారం 'సాక్షి'కి వెల్లడించారు.

గంట ముందు నుంచే అనుమతి

జిల్లాలో పరీక్షల నిర్వహణకు 97 కేంద్రాలు ఏర్పాటు చేయగా 16,788మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 16,417మంది రెగ్యులర్ విద్యార్థులు, 371మంది ప్రైవేట్(సప్లిమెంటరీ) విద్యార్థులు ఉన్నారు. నిర్ణీత తేదీల్లో ఉదయం 9–30నుంచి మధ్యాహ్నం 12–30గంటల వరకు పరీక్ష కోసం విద్యార్థులను 8–30గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. కాగా, 9–35గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఈ విషయాన్ని గుర్తించి ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని డీఈఓ సూచించారు. కాగా, కేంద్రాల వద్ద తాగునీరు, ఫర్నీచర్, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యం కల్పించామని తెలిపారు.

ఎవరైనా నడిచి వెళ్లాల్సిందే..

పరీక్ష కేంద్రాల్లో తనిఖీ చేసే బృందాలు గతంలో వాహనాలతో సహా పాఠశాలల ఆవరణలోకి వెళ్లేవారు. కానీ ఈసారి వాహనాలను ఆరుబయటే ఆపి నడిచి వెళ్లాల్సి ఉంటుంది. వాహనాల రాకపోకలతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారనే సమాచారంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

సిబ్బంది ఇలా...

జిల్లాలోని పరీక్షా కేంద్రాలను ఏడు రూట్లుగా విభజించగా.. 97మంది చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఏఎస్‌ఎంలు, పోలీస్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. మొత్తంగా 1,185మంది ఇన్విజిలేటర్లను నియమించారు. కాగా, 20 పరీక్షా కేంద్రాలను 'సీ' సెంటర్లుగా గుర్తించినట్లు డీఈఓ తెలిపారు.

అడిషనల్స్ ఉండవు..

గతంలో జవాబుపత్రంగా ఒక జంట పేపర్ ఇచ్చేవారు. ఆపై విద్యార్థులకు కావాలంటే అదనపు జవాబుపత్రాలు(అడిషనల్స్) ఇవ్వడం ఆనవాయితీగా కొనసాగేది. కానీ ఈసారి నుంచి 24పేపర్లతో కూడిన బుక్‌లెట్ ఇవ్వనున్నారు. విద్యార్థులు దీనినే సద్వినియోగం చేసుకుని నిర్ణీత ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది.

కంట్రోల్ రూమ్

విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. ఫీజులు చెల్లించలేదని, ఇతర కారణాలతో ఎక్కడైనా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్లు ఇవ్వకుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. దీంతో పాటు ఇతర సమస్యలు ఉంటే డీఈఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 83318 51510కు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

అబ్జర్వర్‌గా విజయలక్ష్మీబాయి

పాఠశాల విద్యాశాఖలో డైరెక్టర్ స్థాయి అధికారులు జిల్లాకొకరిని పరిశీలకులుగా నియమించారు. ఈక్రమాన ఉమ్మడి ఖమ్మం జిల్లా అబ్జర్వర్‌గా విజయలక్ష్మీబాయిని కేటాయించారు. ఆమె ఉమ్మడి జిల్లాలో పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షిస్తూ యంత్రాంగానికి సూచనలు చేయనున్నారు.

ప్రియమైన తల్లిదండ్రులారా...

పదో తరగతి పరీక్షలు సమీపించిన నేపథ్యాన జిల్లాలోని విద్యార్థుల తల్లిదండ్రులకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ లేఖ రాశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకునే వాతావరణం కల్పించడం, ఆందోళనకు గురికాకుండా పరీక్షలకు సిద్ధం చేయడం, ఫలితాలపై ఒత్తిడికి గురిచేయకపోవడం, పౌష్టికాహారం అందించాల్సిన ఆవశ్యకతపై ఇందులో సూచనలు చేశారు. ఈమేరకు లేఖ(సాఫ్ట్ కాపీ)ను పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు చేరవేయగా.. వారు ఎస్సెస్సీ విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటుచేసిన వాట్సప్ గ్రూప్‌ల్లో పంపిస్తున్నారు.

కేంద్రాల వద్ద 163 సెక్షన్

ఖమ్మంక్రైం: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమల్లో ఉంటుందని సీపీ సునీల్‌దత్ తెలిపారు. కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు గుంపుగా ఉండొద్దని, సభలు, సమావేశాలు, మైక్‌లు, డీజేలతో ప్రదర్శనలకు అనుమతి ఉండదన్నారు. పరీక్ష సమయాన కేంద్రాలకు సమీపంలో ఇంటర్‌నెట్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

ఐటీఐలో రేపు ప్లేస్‌మెంట్ డ్రైవ్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం టేకులపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శుక్రవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా కార్మిక ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ ఆధ్వర్యాన రిజిస్టర్డ్ అయిన ఏజెన్సీల బాధ్యులు పాల్గొని ప్లేస్‌మెంట్లు కల్పిస్తారని పేర్కొన్నారు. ఈమేరకు 18నుంచి 40 ఏళ్లలోపు అభ్యర్థులు ఉదయం పది గంటలకు మొదలయ్యే డ్రైవ్‌కు హాజరుకావాలని సూచించారు.

ఖమ్మం కొత్త, పాత బస్టాండ్లలో ఆర్‌ఎం తనిఖీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని ఆర్టీసీ కొత్త, పాత బస్టాండ్లలో హోటళ్లు, షాపులను రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ బుధవారం తనిఖీ చేశారు. కొత్త బస్టాండ్‌లోని హోటల్‌లో ఆహార పదార్థాలు, కిచెన్‌ను పరిశీలించి తాగునీటి బాటిళ్ల ధరపై ఆరా తీశారు. హోటళ్ల నిర్వాహకులు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. అపరిశుభ్రంగా ఉన్నా, తాగునీటి బాటిళ్లు అధిక ధరలకు విక్రయించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, బస్టాండ్లలోని వాటర్ కూలర్లను శుభ్రం చేయించాలని డీఎం దినేష్‌కుమార్‌ను ఆదేశించారు.

యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్‌కు స్థల పరిశీలన


స్కూల్ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బోనకల్: బోనకల్ మండలం లక్ష్మీపురం గ్రామంలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్‌కు కేటాయించాలని స్థలాన్ని ఉన్నతాధికారులు బుధవారం పరిశీలించారు. తెలంగాణ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఎండీ గణపతిరెడ్డి, ఇంజనీర్లు షఫీమియా, విన్సెంట్‌రావు స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. లక్ష్మీపురం రెవెన్యూ పరిధి సర్వేనంబర్ 401లో గుర్తించిన 30ఎకరాల స్థలం స్కూల్ నిర్మాణానికి అనువుగా ఉందని పేర్కొన్నారు. త్వరలోనే పాఠశాల నిర్మాణ పనులు మొదలవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏజెంట్ల వద్ద సైతం తలంబ్రాల బుకింగ్


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎం, ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలంలో జరగనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ తలంబ్రాలు కావాల్సిన భక్తులు ఖమ్మం డిపో పరిధిలోని ఆర్టీసీ కార్గో ఏజెంట్ల వద్ద బుక్ చేసుకోవచ్చని డిపో మేనేజర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఖమ్మం కొత్త బస్టాండ్‌లో బుధవారం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. స్వామి వారి తలంబ్రాలను ఇంటి వద్దే అందించనుండగా, ఖమ్మం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్(91542 98583), ఖమ్మం పాతబస్టాండ్ ఏజెంట్(97043 45599), కొణిజర్ల ఏజెంట్(85220 12587), నేలకొండపల్లి ఏజెంట్ 83310 06959, బోనకల్ ఏజెంట్(83091 25037)ను సంప్రదించాలని సూచించారు.

మత్స్యకారులకు ముగిసిన శిక్షణ

కూసుమంచి: మండలంలోని పాలేరులో పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో ములుగు జిల్లాకు చెందిన మత్స్యకారులకు ఇస్తున్న మూడు రోజుల శిక్షణ బుధవారం ముగిసింది. చివరి రోజు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నల్లగొండలో వనామి రొయ్యల పెంపకాన్ని పరిశీలించారు. ఆతర్వాత హైదరాబాద్‌లోని మత్స్య అభివృద్ధి మండలిని సందర్శించి అక్కడ మత్స్యరైతులకు కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను తెలుసుకున్నారు. పాలేరు పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,200	5,500
కందులు	6,000	3,000
అలసంద	6,000	6,000
మిర్చి	13,500	6,100
మిర్చి తాలు	6,100	5,000
పత్తి	7,100	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,871

ఇంటర్ విద్యార్థులు.. ఇంటి బాట !


పరీక్షలు ముగియడంతో విద్యార్థినుల కేరింతలు

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగిశాయి. దీంతో పరీక్ష కేంద్రాల నుంచి బయటకు రాగానే విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొట్టారు. స్నేహితుల నుంచి వీడ్కోలు తీసుకుంటూ త్వరలోనే మళ్లీ కలుద్దామని ఇంటి బాట పట్టారు. పరీక్ష ముగిసి విద్యార్థులు హాస్టళ్లకు వచ్చేలోగా తల్లిదండ్రులు సిద్ధంగా ఉండడంతో లగేజీతో ఇళ్లకు బయలుదేరారు. చాలామంది ప్రయాణానికి ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో జిల్లా కేంద్రంలోని కొత్త, పాత బస్టాండ్లు కిటకిటలాడాయి.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్


లగేజీ సహా పిల్లలను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు


పాత బస్టాండ్‌లో రద్దీ

వాస్తవాలతోనే సమాజ అభ్యున్నతి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- 'యువ పార్లమెంట్'కు మూడు జిల్లాల నుంచి 102 మంది హాజరు


సమావేశాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


మాట్లాడుతున్న యువతి

ఖమ్మంరాపర్తినగర్: వాస్తవానికే ఎప్పుడూ విలువ ఉంటుందని.. అలా అందరు భావిస్తేనే సమాజ అభ్యున్నతి సాధ్యమవుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఈవిషయాన్ని యువతీ, యువకులు పాటించడమే మరికొందరికి అవగాహన కల్పించాలని సూచించారు. ఖమ్మంలోని కేఎండీసీలో బుధవారం వికసిత్ భారత్‌లో భాగంగా ఏర్పాటుచేసిన యువ పార్లమెంట్ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. యువత తమ తెలివితేటలను సక్రమమైన మార్గంలో వినియోగించడంలో కొంత మేర వెనకబడుతున్నారని చెప్పారు. దేశానికి స్వాతంత్య్రం తీసుకొచ్చేందుకు పాటుపడిన మహనీయులు, గొప్పస్థానాల్లో ఉన్న వారిని ఆదర్శంగా తీసుకోవడమే కాక ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉంటూ సరైన నాయకులను ఎన్నుకుంటే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కోట అప్పిరెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరామ్ మాట్లాడగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఎన్.శ్రీనివాసరావు, నెహ్రూ యువక కేంద్ర అధికారి కె.భానుచందర్, వికసిత్ భారత్ నోడల్ చైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణారావు, పోటీల జ్యూరీ అధికారులు ప్రొఫెసర్ సీతారాం, దినేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఒక దేశం.. ఒకే ఎన్నిక' ఓకే...

దేశవ్యాప్తంగా అన్ని ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే మంచిదని పలువురు అభిప్రాయపడ్డారు. యువ పార్లమెంట్‌లో భాగంగా నిర్వహించిన పోటీలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల నుండి 102మంది యువతీ, యువకులు హాజరయ్యారు. ప్రతీఒక్కరికి మూడేసి నిమిషాల సమయం కేటాయించగా, ఎక్కువ మంది 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' సరైనదేనని తెలిపారు. ఇంకొందరు ఈ విధానంతో సమస్యలు వస్తాయని తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపు లేదు..

- యథాతథంగానే ప్రస్తుత ధరలు
- బహిరంగ విచారణలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో విద్యుత్ చార్జీల పెంపుపై స్పష్టత వచ్చింది. హనుమకొండలో బుధవారం 2025–2026 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేసిన రిటైల్ సప్లయి వ్యాపారానికి సమగ్ర ఆదాయ ఆవశ్యకత, ధరలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీల ప్రతిపాదనలపై బహిరంగ విచారణ జరిగింది. తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ జస్టిస్ దేవరాజు నాగార్జున్ అధ్యక్షతన జరిగిన ఈ విచారణలో విద్యుత్ టారిఫ్‌ల ప్రతిపాదనలను టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి టారిఫ్ పెంపుదలపై ఎలాంటి ప్రతిపాదనలూ చేయలేదని, ప్రస్తుత ధరల్లో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీని ఎంచుకునే ఎల్‌టీ, హెచ్‌టీ వినియోగదారులకు సాధారణ టారిఫ్ కంటే యూనిట్‌కు రూ.0.66 గ్రీన్ టారిఫ్ విధింపు కొనసాగుతుందని తెలిపారు. ఓపెన్ యాక్సెస్‌లో విద్యుత్ కొనుగోలు చేసి ఎన్పీడీసీఎల్ విద్యుత్ లైన్లు వినియోగించుకున్న వినియోగదారులకు ఎనర్జీ చార్జీల్లో 10 శాతం చొప్పున స్టాండ్ బై చార్జీల విధింపు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. టీజీ ఎన్పీడీసీఎల్ నిర్వహణకు 2025–2026 ఆర్థిక సంవత్సరంలో రూ.19,814 కోట్ల ఆదాయ ఆవశ్యకత ఉందని తెలిపారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత టారిఫ్(టారిఫేతర ఆదాయం కలుపుకుని) రూ.9,421కోట్లు వస్తుందని అంచనా వేయగా, రూ.10,393 కోట్ల రెవెన్యూ లోటు ఏర్పడుతుందని వివరించారు.

పదెకరాల్లో ఆయిల్‌పామ్ తోట దగ్ధం

షార్ట్ సర్క్యూట్ కారణమని రైతులు ఆవేదన


తోటలో కాలిపోయిన చెట్లు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం బావోజీ తండాలో పది ఎకరాల్లోని ఆయిల్‌పామ్ తోటలో చెట్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా కాలిపోయాయి. బాధిత రైతు బానోత్ శివలాల్ తెలిపిన వివరాలు... బుధవారం మధ్యాహ్నం తోటలో మంటలు చెలరేగాయనే సమాచారంతో వెళ్లగా కాపుదశకు వచ్చిన ఆయిల్‌పామ్ పామాయిల్ చెట్లు కాలిపోయాయని వాపోయారు. తోట మీదుగా వెళ్తున్న విద్యుత్ వైర్లను తొలగించాలని, అందుకు అయ్యే వ్యయం కూడా భరిస్తానని చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడం ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. వడగాలులతో విద్యుత్ తీగలు ఒకదానికొకటి తాకగా షార్ట్ సర్క్యూట్ జరిగిందని చెప్పారు. కాగా, శివలాల్ తోటలో మొదలైన మంటలు పక్క తోటకు సైతం వ్యాపించగా సుమారు పదెకరాల్లో తోట కాలిపోయింది. ఇప్పటికే గెలలు వేయగా త్వరలోనే అమ్మేందుకు సిద్ధమవుతుండగా జరిగిన ఈ ప్రమాదంలో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

లారీడ్రైవర్ ప్రాణాలు కాపాడిన పోలీసులు


కృపారావుకు వైద్యం చేయిస్తున్న పోలీసులు

పెనుబల్లి: ఓ లారీడ్రైవర్ గుండెపోటుకు గురికాగా సకాలంలో స్పందించిన వీఎం బంజర్ పోలీసులు ఆయనను ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి నుండి మొక్కజొన్న లోడ్ హైదరాబాద్ తీసుకెళ్తున్న లారీ డ్రైవర్ మొగుళ్ల కృపారావుకు బుధవారం తెల్లవారుజామున వీఎం బంజర్ సమీపాన ఛాతినొప్పి వచ్చింది. దీంతో రోడ్డు పక్కన వాహనాన్ని ఆపి రామకృష్ణ అనే వ్యక్తికి తన పరిస్థితి చెప్పడంతో ఆయన వీఎం బంజర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈమేరకు హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, కానిస్టేబుల్ వీరరాఘవులు, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ పుల్లారావు చేరుకుని కృపారావును పోలీసు వాహనంలో పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా సకాలంలో వైద్యం అందడంతో ప్రాణాపాయం నుండి బయటపడ్డాడు. దీంతో రామకృష్ణ, పోలీసుసిబ్బందిని స్థానికులు అభినందించారు.

హత్యాయత్నం కేసులో రిమాండ్

కామేపల్లి: సింగరేణి మండలం కొత్తకమలాపురానికి చెందిన ఆర్‌ఎంపీ వడ్డే రంగారావుపై ఐదు రోజుల క్రితం దాడి చేసి, హత్యకు యత్నించిన వారిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. నెమలిపురి తండాకు చెందిన వేముల రాధాకృష్ణతో పాటు మరో ఐదుగురు ఆర్‌ఎంపీని హత్య చేసేందుకు ప్రయత్నించారని అందిన ఫిర్యాదుతో అరెస్ట్ చేశామని పేర్కొన్నారు.

బడ్జెట్ బాగుంది.. లేదు నిరాశ పరిచింది...

వివిధ పార్టీల నాయకుల భిన్నాభిప్రాయాలు

శాసనసభలో బుధవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లాలోని వివిధ పార్టీల నాయకుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవయ్యాయి. కాంగ్రెస్ నాయకులు బడ్జెట్‌లో కేటాయింపులపై హర్షం చేశారు. ఇదే సమయాన బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ, మాస్ లైన్ నాయకులు మాత్రం విద్య, వైద్య, సాగునీటి రంగాలకు సరైన కేటాయింపులు లేవని పెదవి విరిచారు. ఖమ్మం జిల్లాకు జనరల్ యూనివర్సిటీ కేటాయించకపోవడాన్ని తప్పుపట్టారు. కాగా, వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారని సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లమల వెంకటేశ్వరరావు పేర్కొనగా, పెన్షనర్లు, ఉద్యోగులను నిరాశపరిచేలా బడ్జెట్ ఉందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్

అందరినీ మోసం చేశారు..



ఏ వర్గానికి ఈ బడ్జెట్ మేలు చేయదు. ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీలకు మంగళం పాడారు. ఆటోడ్రైవర్ మొదలు అన్నదాతల వరకు సరైన కేటాయింపులు చేయకుండా అందరినీ రాష్ట్రప్రభుత్వం మోసం చేసింది. – తాతా మధుసూదన్, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

ప్రజారంజకంగా ఉంది..



ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉంది. ప్రజలందరి ఆశలకు అనుగుణంగా భావిభారత పౌరుల అభివృద్ధే ధ్యేయంగా కేటాయింపులు చేశారు. హామీల అమలుకు అధికంగా కేటాయించారు. – పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

జిల్లాకు అన్యాయం..



ఆర్థికమంత్రి సహా ముగ్గురు మంత్రులు ఉన్నా కేటాయింపుల్లో అన్యాయం జరిగింది. సీతారామ ప్రాజెక్టుకు రూ.699 కోట్లు కేటాయించడమే దీనికి నిదర్శనం. ఈ నిధులు పెంచి, జనరల్ యూనివర్సిటీ మంజూరు చేయాలి. – నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి, సీపీఎం

ప్రాజెక్టులు పూర్తికావు...



రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశలు ప్రతిబింబించేలా లేదు. రూ.56 వేల కోట్లతో హామీలు అమలుకాకపోగా, రూ.23వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులు పూర్తికావు. అయితే, వ్యవసాయ శాఖకు మాత్రం బడ్జెట్ పెంచడం ఒక్కటే శుభపరిణామం. – బాగం హేమంతరావు, జాతీయ సమితి సభ్యులు, సీపీఐ

గ్యారంటీల ప్రస్తావన ఏదీ?



ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు చేయలేక ఈ ప్రభుత్వం పారిపోతున్నట్లుగా బడ్జెట్ ద్వారా స్పష్టమైంది. ఆరు గ్యారంటీలు సహా ఇతర పథకాలకు సరైన కేటాయింపులే లేవు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి బడ్జెట్ బాగుంటుందనుకుంటే నిరాశే ఎదురైంది. – కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు

హామీలకు అనుగుణంగా లేదు..



పాత బడ్జెట్ తరహాలోనే కొత్త మాటలతో ఉంది. ఆరు గ్యారంటీల్లో రెండు, మూడు తప్ప మిగతా వాటిని ప్రస్తావనే లేదు. ఉద్యోగాల భర్తీ అంశం లేకపోగా, విద్యా, వైద్యరంగాలకు సైతం ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. – పోటు రంగారావు, మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి

అన్ని వర్గాలకు అసంతృప్తే...



బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను అసంతృప్తికి గురిచేసింది. ఆరు గ్యారంటీలకు గ్యారంటీ లేకపోగా, వ్యవసాయ, సంక్షేమ రంగాల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదు. వైద్య రంగానికి సైతం తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. ఇక మహిళలకు ఇచ్చిన హామీల ఊసే లేదు. – బానోతు చంద్రావతి, వైరా మాజీ ఎమ్మెల్యే

హెచ్‌డబ్ల్యూఓగా రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి


రమేష్

చింతకాని: మండలంలోని పాతర్లపాడుకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి నెల్లూరి రమేష్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. ఆయన కొన్నేళ్లు ఆర్మీలో విధులు నిర్వర్తించాక 2016లో రిటైర్మెంట్ తీసుకున్నాడు. అనంతరం 2018లో గ్రామపంచాయతీ కార్యదర్శిగా ఎంపికై నా 2020లో రాజీనామా చేశాడు. ఆతర్వాత బీఈడీ చదివిన రమేష్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపిక కాగా, పలువురు అభినందించారు.

నవ్య.. మరో ఉద్యోగం

తల్లాడ: మండలంలోని మంగాపురానికి చెందిన గాదె నవ్య మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో రెండో ఉద్యోగం సాధించింది. మంగళవారం వెలువడిన ఫలితాల్లో సూపరింటెండెంట్ ఉద్యోగానికి అర్హత సాధించిన ఆమె, బుధవారం వెలువడిన గ్రేడ్-1 సూపర్‌వైజర్ ఫలితాల్లోనూ రాష్ట్రస్థాయి 89, జోన్‌లో 9వ ర్యాంక్ సాధించడం విశేషం. నవ్య భర్త పరచూరి రమేష్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు, రేపు కార్పొరేట్ మెడికల్ బోర్డు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో గురు, శుక్రవారాల్లో కార్పొరేట్ మెడికల్ బోర్డ్ నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. నేడు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించనుండగా మెడికల్ రిపోర్ట్‌ల ఆధారంగా పని చేయలేని వారిని శుక్రవారం అన్‌ఫిట్ చేస్తామని తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉద్యోగి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని లింగాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన తాళ్ల శ్రీనివాసరావు(48) సిరిసిల్లలో చేనేత శాఖలో డీఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రామంలోని బంధువులను కలిసేందుకు మంగళవారం వచ్చిన ఆయన బుధవారం ఉదయం కొత్త చెరువు వద్ద బహిర్భూమికి వెళ్లిన క్రమంలో కాలుజారి పడగా మృతి చెందాడు. ఆయనకు భార్య సరిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భార్య వచ్చాక పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

ఎన్నెస్పీ కాల్వలో పడి ఒకరు...

తల్లాడ: ప్రమాదవశాత్తు ఎన్నెస్పీ కాల్వలో పడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. కల్లూరు మండలం బాలాజీనగర్‌కు చెందిన కాళ్ల నాగేశ్వరరావు(55) కాల్వలో పడగా, మృతదేహం తల్లాడ మండలం రంగంబంజర సమీపాన తేలింది. దీంతో స్థానిక రైతులు ఇచ్చిన సమాచారం మేరకు పరిశీలించిన పోలీసులు మృతదేహం నాగేశ్వర్‌రావుదిగా గుర్తించారు. కూలీ పనులతో జీవనం సాగించే ఆయన రెండు రోజుల క్రితం పనికి వెళ్లొచ్చాక మద్యం కోసం బయటకు వెళ్లి రాకపోవడంతో కుటుంబీకులు గాలిస్తున్నారు. ఇంతలోనే మృతదేహమై కనిపించగా ఆయన కుమారుడు శివసుబ్రమణ్యం ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కొండల్‌రావు తెలిపారు.

బావిలో పడిన ట్రాక్టర్.. డ్రైవర్ మృతి


మంగరాజు (ఫైల్)

బోనకల్: ప్రమాదవశాత్తు బావిలో ట్రాక్టర్ పడగా డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దబీరవల్లి రెవెన్యూ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. వైరా మండలం పాలడుగుకు కంచపోగు మంగరాజు(28) పొలంలో పత్తి కట్టె తొలగిస్తుండగా ట్రాక్టర్‌ను ముందుకు, వెనకకు నడిపించే క్రమాన ఇంజిన్‌తో సహా బావిలో పడ్డాడు. దీంతో మంగరాజు నీట మునిగి మృతి చెందగా స్థానికులు మృతదేహాన్ని బయటకు తీయగా, ఘటనపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆనంద్‌కుమార్ తెలిపారు.

ఆస్పత్రిలో గుర్తుతెలియని యాచకుడు మృతి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని జిల్లా ఆస్పత్రి ఆవరణలో అంబులెన్స్‌ల వద్ద గుర్తు తెలియని వ్యక్తి యాచకుడు(70) బుధవారం మృతి చెందాడు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు డయల్ 100కు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఖమ్మం టూటౌన్ పోలీసులు, అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు కలిసి మార్చురీలో మృతదేహాన్ని భద్రపరిచారు.

మోసం చేశాడని యువకుడిపై ఫిర్యాదు

ఖమ్మంఅర్బన్: ప్రేమ పేరిట నాలుగేళ్లు కలిసి ఉండి ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని ఓ యువకుడిపై యువతి ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఖమ్మం శ్రీనగర్‌కాలనీలో నివాసముండే ఆమె ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాష్ తెలిపారు. ఇతర ప్రాంతానికి చెందిన వారిద్దరు కొద్దినెలలుగా శ్రీనగర్‌లో నివాసముంటున్నారని తెలిపారు.

తొమ్మిదో తరగతి విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

డిప్యూటీ వార్డెన్‌ను చితకబాదిన గ్రామస్తులు


డిప్యూటీ వార్డెన్‌కు దేహశుద్ధి చేస్తున్న గ్రామస్తులు

టేకులపల్లి: విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన డిప్యూటీ వార్డెన్‌ను తల్లిదండ్రులు, గ్రామస్తులు బుధవారం చితకబాదారు. టేకులపల్లి మండలంలోని గంగారం ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్(హిందీ టీచర్) మాలోత్ ప్రతాప్‌సింగ్ మంగళవారం మద్యం తాగి విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం పాఠశాల ఆవరణలో తొమ్మిదో తరగతి బాలికపై చేతులు వేసి అసభ్యంగా మాట్లాడుతూ ఇబ్బందికి గురి చేశాడు. దీంతో ఆమె డిప్యూటీ వార్డెన్‌ను నెట్టేయగా, అదే సమయంలో వంట చెరకు డబ్బుల కోసం వచ్చిన గ్రామస్తులకు విషయం తెలిపింది. దీంతో వారు ప్రశ్నించగా తప్పయిందని చెప్పి ప్రతాప్ వెళ్లిపోయాడు. గ్రామస్తులు విషయం తెలపడంతో బాలిక తల్లిదండ్రులు, గ్రామపెద్దలు, బంధువులు రాత్రి పాఠశాలకు రాగా, డిప్యూటీ వార్డెన్ అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో బుధవారం మళ్లీ వారంతా పాఠశాలకు వచ్చి డిప్యూటీ వార్డెన్, హెచ్‌ఎంలను నిలదీశారు. డిప్యూటీ వార్డెన్ పశ్చాత్తాపం లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుండటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చితకబాదడంతో పారిపోయాడు. బోడు ఎస్‌ఐ పొడిశెట్టి శ్రీకాంత్, డిప్యూటీ తహసిల్దార్ ముత్తయ్య, ఏటీడీవో రాధ పాఠశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. కాగా, డిప్యూటీ వార్డెన్‌పై హెచ్‌ఎం జగన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, పాఠశాల నుంచి తిరిగి వెళ్తున్న బోడు పోలీసులకు డిప్యూటీ వార్డెన్ తారస పడటంతో అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

విద్యుత్ సేవల్లో సాంకేతికత..

వినియోగదారులతో పాటు విద్యుత్ శాఖకు సౌకర్యవంతంగా ఉండేలా టీజీ ఎన్పీడీసీఎల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. ఇందులో భాగంగా 20 అంశాలతో కూడిన యాప్‌ను అందుబాటులోకి తీసుకురాగా.. వినియోగదారులు తమ ఫోన్ నుంచే సమస్యలపై ఫిర్యాదు చేసే అవకాశం లభిస్తోంది. వివిధ ఫిర్యాదులు, బిల్లులు, నూతన సర్వీసులు, మీటర్ పేరు మార్పిడి తదితర అంశాలను ఈ యాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు. వినియోగదారులకు ఈ యాప్‌తో మేలు జరగడమే కాక నేరుగా సమస్యలు తెలుసుకునేందుకు అధికారులకూ ఉపయోగపడుతోంది. అంతేకాక ఉద్యోగుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని భావిస్తున్నారు. – ఖమ్మంవ్యవసాయం



- 20 అంశాలతో టీజీ ఎన్పీడీసీఎల్ యాప్
- ఘటనలు, ఫిర్యాదులు నమోదు చేసేలా రూపకల్పన
- ఇటు వినియోగదారులకు లబ్ధి.. ఉద్యోగుల్లో జవాబుదారీ తనం

యాప్‌లోని అంశాలు ఇలా..

- **రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్ :** ఎక్కడైనా ఎలాంటి ఘటన జరిగినా ఇందులో జీపీఎస్ లొకేషన్ ద్వారా ఫొటో తీసి పంపొచ్చు. తద్వారా సంబంధిత అధికారి పరిశీలించి పరిష్కరించేందుకు వీలవుతుంది.
- **కన్స్యూమర్ గ్రీవెన్స్ : న్యూ కంప్లైంట్ :** వినియోగదారులకు సంబంధించి సమస్యలను నేరుగా ఇందులో పొందుపర్చవచ్చు. మీటర్ నంబర్, సమస్య వివరాలు నమోదు చేస్తే పరిష్కరిస్తారు.
- **కంప్లైంట్ స్టేటస్ :** ఫిర్యాదు చేసిన సమస్య స్థితిగతులను ఇందులో చూసుకునే సౌలభ్యం ఉంది.
- **రీ ఓపెన్ కంప్లైంట్ :** ఫిర్యాదు చేసిన సమస్యపై సంతృప్తి చెందకపోతే మళ్లీ అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు.
- **సెల్ఫ్ రీడింగ్ :** ఇందులో వినియోగదారులు సెల్ఫ్ రీడింగ్ తీసుకునే వెసులుబాటు కల్పించారు. తద్వారా సిబ్బంది వచ్చే వరకు వేచి ఉండాల్సిన పని ఉండదు.
- **పే బిల్స్ :** నెలవారీ విద్యుత్ బిల్లులను వినియోగదారుల సర్వీస్ నంబర్ ఆధారంగా చెల్లించవచ్చు. ఇది సులభమే కాక సమయం ఆదా అవుతుంది.
- **బిల్ హిస్టరీ :** చెల్లించిన విద్యుత్ బిల్లుల వివరాలు తెలుసుకుని నెల వారీగా హెచ్చుతగ్గులను నిర్ధారించుకోవచ్చు.
- **ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ :** ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన బిల్లుల తాలూకు సమాచారం ఇందులో ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన బిల్లుల సమాచారం తెలుసుకోవచ్చు.
- **కొత్త సర్వీస్ స్థితి :** కొత్త సర్వీసుల మంజూరు స్థితిగతులను ఎప్పటికప్పుడు దరఖాస్తు నంబర్ ఆధారంగా తెలుసుకోవచ్చు.
- **లింక్ ఆధార్–మొబైల్ :** వినియోగదారుల ఆధార్, సెల్‌నంబర్లు లింక్ చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల సమాచారం ఫోన్‌కు అందుతుంది.
- **డొమెస్టిక్ బిల్ క్యాలుక్యులేటర్ :** వినియోగదారుల నెలవారీ విద్యుత్ వినియోగం, మీటర్ రీడింగ్ వివరాలు ఇందులో పొందుపరిస్తే బిల్లు తాలూకా పూర్తి సమాచారం వస్తుంది.
- **కొత్త కనెక్షన్ ఎలా తీసుకోవాలి :** కొత్త విద్యుత్ కనెక్షన్ తీసుకోవడానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇందులో ఉంటాయి.
- **పేరు, లోడ్ మార్పు :** విద్యుత్ మీటర్ పేరు మార్పుపై వివరాలు, లోడ్ సమాచారం తెలుసుకుని దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పవర్ కంజప్షన్ గైడ్‌లైన్స్ :** ఏ ఉపకరణాలు ఎంత వాడితే ఎంత విద్యుత్ వినియోగం అవుతుందో తెలుస్తుంది.
- **టారిఫ్ డిటైల్స్ :** విద్యుత్ వినియోగం, చార్జీల వివరాలు కేటగిరీల వారీగా ఇందులో సవివరంగా ఉంటాయి. గృహవినియోగదారులు, గృహేతర విని యోగదారులు, పరిశ్రమల తదితరాల వివరాలు కేటగిరీల వారీగా చార్జీల వివరాలు పొందుపర్చబడి ఉంటాయి.
- **ఎనర్జీ సేవింగ్ టిప్స్ :** ఇందులో విద్యుత్ ఉపకరణాలు వాడుతున్నప్పుడు పొదుపు కోసం ఆచరించాల్సిన సూచనలు ఉంటాయి.
- **సేఫ్టీ టిప్స్ :** విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు ఉంటాయి. ఎప్పటికప్పుడు వినియోగదారులను అప్రమత్తం చేసేందుకు ఉపయోగపడుతుంది.
- **ఫీడ్‌బ్యాక్ :** విద్యుత్ సేవల పట్ల వినియోగదారుల అభిప్రాయాన్ని పంచుకోవచ్చు. తద్వారా మెరుగైన సేవలను పొందే అవకాశం ఉంటుంది.
- **మై అకౌంట్ :** మై అకౌంట్‌లో వినియోగదారుల పూర్తి వివరాలు ఉంటాయి. మీటర్ తాలూకు వివరాలు, తదితర సమాచారం దీనిలో ఉంటుంది.
- **బిల్లు సమాచారం :** వినియోగదారుల బిల్లులకు సంబంధించిన సమాచారం దీనిలో ఉంటుంది. వినియోగదారుల సర్వీస్ నంబర్ నమోదుచేసి బిల్లు వివరాలు తెలుసుకోవచ్చు.
- **అధికారి వివరాలు :** వినియోగదారుల పరిధిలోని అధికారిని సంప్రదించాలంటే ఇందులో నుంచి తెలుసుకోవచ్చు. ఎటువంటి సందేహాలు ఉన్నా సంబందిత అధికారిని ఫోన్ ద్వారా సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు.
- **కాంటాక్ట్ అజ్ :** దీనిలో 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లు ఉంటాయి. సమస్యల పరిష్కారం కోసం సంప్రదించవచ్చు. టోల్ ఫ్రీ నంబర్లు 18004250028, 1912.

యాప్ సేవలు ప్రయోజనకరం



వినియోగదారులు తమ మొబైల్ ఫోన్‌లో టీజీఎన్పీడీసీఎల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. తద్వారా సంస్థ సమాచారం తెలుసుకోవడమే కాక మెరుగైన సేవలు పొందొచ్చు. ఈ యాప్ సేవలు అటు వినియోగదారులకే కాక సంస్థకు సైతం ప్రయోజనకరం.

– ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఎస్ఈ, ఖమ్మం సర్కిల్

పీజీ కళాశాలలో కొత్త కోర్సులు

- కాలేజ్ ఆఫ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌కు ప్రతిపాదనలు
- జాబితాలో నాలుగు కోర్సులు
- అన్నీ అనుకూలిస్తే వచ్చే విద్యాసంవత్సరంలో ప్రారంభం



ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల

ఖమ్మం సహకారనగర్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సత్తా చాటేలా విద్యారంగంలోనూ మార్పులు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు భవిష్యత్ బాగుండేలా కొత్త కోర్సులు నేర్చుకోవడంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈనేపథ్యాన విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉండే కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు.

ఉన్నతాధికారులకు ప్రతిపాదన

ఖమ్మంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో ప్రస్తుతం ఉన్న కోర్సులకు తోడు ఎంసీఏ, ఎంఏ మ్యాథ్స్, ఎంఏ తెలుగు, మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులు ప్రవేశపెట్టాలనే నిర్ణయానికి వచ్చారు. ఈమేరకు కాలేజ్ ఆఫ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్‌కు తాజాగాప్రతిపాదనలు పంపారు. అక్కడి నుంచి అనుమతులు రాగానే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కల్పించే అవకాశముంది. విద్యార్థుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు ఈ కోర్సులను ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

కమిటీ పరిశీలించాకే..

ప్రస్తుతం నూతన కోర్సులు ప్రవేశపెట్టడానికి కళాశాల నుంచి సీడీసీ డీన్‌కు ప్రతిపాదనలు పంపారు. వీటిని పరిశీలించాక వీసీ, రిజిస్ట్రార్ అనుమతి జారీ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఖమ్మంలో కొత్త కోర్సుల ఆవశ్యకత, వీటిని బోధించేందుకు సరిపడా అధ్యాపకులు ఉన్నారా, ఒకవేళ ప్రవేశపెడితే ప్రవేశాలు ఉంటాయా అన్నది కమిటీ ద్వారా పరిశీలించాక మంజూరు చేసే అవకాశముంది.

ప్రతిపాదనలు పంపాం..



విద్యార్థుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు కొత్త కోర్సు ప్రారంభానికి చర్యలు తీసుకున్నాం. ఇందులో భాగంగా యూనివర్సిటీకి ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారులు పరిశీలించి ఆమోదిస్తే వచ్చే విద్యాసంవత్సరం తరగతులు మొదలయ్యే అవకాశముంది.

– రవికుమార్, ప్రిన్సిపాల్, యూనివర్సిటీ పీజీ కళాశాల, ఖమ్మం

పచ్చని పంట.. పుదీనా!





పుదీనా ఆకు కోస్తున్న కూలీలు (ఇన్‌సెట్)మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేసిన పుదీనా కట్టలు

- మంగాపురంలో విస్తృతంగా సాగు
- రైతులకు నికర ఆదాయం.. కూలీలకూ ఉపాధి
- డ్రిప్ విధానంలో వేసవిలోనూ ఆశాజనకంగా దిగుబడి

తల్లాడ: వాణిజ్య పంటలకు రూ.లక్షల్లో పెట్టుబడి పెడుతున్నా సరైన దిగుబడి రాక రైతులు నష్టపోతున్న ఈ తరుణంలో తల్లాడ మండలం మంగాపురంలో ఒక రైతు మొదలుపెట్టిన పుదీనా సాగు మరికొందరు అదే బాట పట్టేలా స్ఫూర్తినిచ్చింది. దీంతో ఆ గ్రామం పుదీనానే కాక ఇతర ఆకు, కూరల సాగులోనూ మేటిగా నిలుస్తోంది.

ఐదేళ్ల క్రితం ప్రారంభం..

మంగాపురానికి చెందిన రైతు గాదె నరసింహారావు ఐదేళ్ల క్రితం పుదీనా సాగు మొదలుపెట్టాడు. ఈ పంటతో ఆయన లాభాలు గడిస్తుండగా మరికొందరూ అదే బాట పడుతున్నారు. కాగా, నర్సింహారావు నాలుగున్నర ఎకరాల్లో పుదీనా సాగు చేసి డ్రిప్ ఇరిగేషన్ విధానంలో నీరందిస్తున్నాడు. పుదీనాకు తోడు కాకర, దోసకాయ, టమాటా పంటలను కూడా సాగు చేస్తుండగా మంచి ఫలితాలు వస్తున్నాయి. ఒకసారి డ్రిప్ ద్వారా నీరు వదిలితే పంటతా తడుస్తుండడంతో పర్యవేక్షించాల్సిన భారం కూడా తప్పిందని చెబుతున్నారు. పుదీనాతో పాటు గ్రామ రైతులు పాలకూర, తోటకూర, టమాట, దోసకాయ, వంకాయ, బెండకాయ, బీరకాయ వంటి పంటలను కూడా పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

అంటుకట్టే పద్ధతిలో..

పుదీనా సాగులో రైతులు అంటు కట్టే విధానం అవలంబిస్తున్నారు. మొదట అంటుకట్టి నీరు పెడితే రెండు నెలలకు పుదీనా కోతకొస్తోంది. ఆపై మళ్లీ డ్రిప్ ద్వారా నీరు పెట్టుకుంటూ కలుపు తీసి పోషణ చేసుకుంటే 45 రోజుల్లో రెండో కోత వస్తుందని చెబుతున్నారు. ఆపై మళ్లీ నీటి సరఫరాతో ఇంకో 45 రోజులకు.. ఇలా 20 కోతల వరకూ పుదీనా తీసుకోవచ్చని రైతులు చెబుతున్నారు.

ప్రతీనెల ఆదాయం..

ఓ రైతు నాలుగున్నర ఎకరాల్లో పుదీనా సాగు చేస్తే ఎకరానికి రూ.లక్ష చొప్పున పెట్టుబడి అవసరమవుతుంది. ఆపై అన్ని ఖర్చులు పోను నెలకు రూ.50 వేల లాభం వస్తుందని చెబుతున్నారు. చీడపీడలు తక్కువ కావడం.. వైరా మార్కెట్‌లో హోల్‌సేల్ వ్యాపారులు కట్ట రూ.6కు తీసుకుంటుండడం.. తరచుగా ఖమ్మం, కొత్తగూడెంలోనూ అమ్ముతుండడంతో రైతులకు నికర లాభం వస్తోందని చెబుతున్నారు. దీనికి తోడు ఎకరానికి పది మంది కూలీలు పుదీనా కోసి కట్టలు కట్టాల్సి ఉంటుంది. దీంతో ఒక రైతు సాగు చేసే తోటలోనే 30 మంది వరకు కూలీలు అవసరం అవుతుండడంతో స్థానికంగా కూలీలకు నిత్యం రూ.400 చొప్పున అందుతున్నాయి.

ఒకసారి అంటుకడితే 20 సార్లు..



ప్రతీనెల పుదీనా సాగుతో ఖర్చులు పోగా రూ.50వేల వరకు మిగులుతున్నాయి. నిత్య పరిశీలనకు తోడు ఓసారి అంటు కట్టి నీరు పెడుతుంటే 20 సార్లయినా పుదీనా తీసుకోవచ్చు. చీడపీడలు తక్కువే కాగా, కలుపు పెరగకుండా చూసుకుంటే చాలు.

– గాదె నరసింహారావు, రైతు, మంగాపురం

అందరికీ అందుబాటులో...



మా గ్రామ రైతులు పుదీనా సాగు చేస్తుండడంతో ఎప్పుడు కావాలన్నా తాజాగా లభిస్తోంది. వివాహాది శుభకార్యాల సమయాన ఇబ్బంది ఉండడం లేదు. మార్కెట్‌కు వెళ్లే పని లేకుండానే ఫోన్‌లో చెబితే చాలు నేరుగా ఇంటికే తెచ్చి ఇస్తున్నారు.

– పరుచూరి సతీష్, మంగాపురం

క్లుప్తంగా

మరొకరి పార్సిల్ తీసుకెళ్లిన వ్యక్తిపై కేసు

చింతకాని: ఓ వ్యక్తికి వచ్చిన రిజిస్టర్ పార్సిల్‌ను మరో వ్యక్తి తీసుకెళ్లగా పోలీసులు కేసు నమోదు చేశారు. చింతకాని మండలం మత్కేపల్లి గ్రామ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ గద్దం బాలాజీ అనంతసాగర్ గ్రామానికి జనవరి నుంచి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. గతనెల 12వ తేదీన అనంతసాగర్‌కు చెందిన వడ్లమూడి సత్యనారాయణ పేరిట రిజిస్టర్ పోస్ట్ రాగా వడ్లమూడి నాగేశ్వరరావు తానే సత్యనారాయణ అని చెప్పి తీసుకెళ్లాడు. ఆతర్వాత సత్యనారాయణ భార్య సుభద్ర ఆరాతీయగా అప్పటికే తీసుకెళ్లినట్లు చెప్పడంతో సంతకం, ఫోన్ నంబర్‌ను ఆదారంగా వడ్లమూడి నాగేశ్వరరావుగా గుర్తించారు. ఈమేరకు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

రీజియన్‌ను అగ్రగామిగా నిలిపారు...



డిప్యూటీ ఆర్ఎంలను సత్కరించిన ఆర్ఎం, ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో విధులు నిర్వర్తించిన ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) జీ.ఎస్.పవిత్ర, డిప్యూటీ రీజినల్ మేనేజర్(మెకానికల్) ఎస్.భవానీప్రసాద్‌ను రీజియన్‌ను అగ్రగామిగా నిలిపారని రీజినల్ మేనేజర్ ఏ.సరిరాం కొనియాడారు. బదిలీపై వెళ్తున్న పవిత్ర, భవానీప్రసాద్‌ను ఖమ్మం ఆర్ఎం కార్యాలయంలో బుధవారం సన్మానించారు. ఈసందర్భంగా సరిరాం మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు. అనంతరం షాద్‌నగర్, మహబూబ్‌నగర్ రీజియన్లకు పవిత్ర, భవానీప్రసాద్‌ను ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు డిపోల మేనేజర్లు, వివిధ విభాగాల ఉద్యోగులు సన్మానించారు.

జీవిత అనుభవాల్ని తెలిపేదే కథ..



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రవీందర్

ఖమ్మం సహకారనగర్: కథ అంటే జీవిత అనుభవాల్ని తెలపడమే కాక సందేశాన్ని ఇస్తుందని కవి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో కళాశాల తెలుగు విభాగం, ఐక్యూఏసీ విభాగాల ఆధ్వర్యాన బుధవారం 'కథలోకి..' పేరిట నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కథలు రాసే విధానంపై తన అనుభవాలను వివరించగా, ప్రముఖ కథా రచయిత నల్లగొండ నాగార్జున ప్రభుత్వ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెల్దండి శ్రీధర్ తదితరులు మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ పి.రవికుమార్, ఎం.సునంద, డాక్టర్ సీతారాంతో పాటు ప్రసేన్, రవిమారుత్, ఏ.ఎల్.ఎన్.శాస్త్రి, డాక్టర్ బానోత్ రెడ్డి, డాక్టర్ జె.అనురాధ, డాక్టర్ కిరణ్, కోటమ్మ, ఎం.వీ.రమణ, కార్తీక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రైల్వే ట్రాక్‌పై ట్రక్

రైలు చక్రాలకు అనుగుణంగానే పట్టాలు ఉంటాయి. తద్వారా వీటిపై రైళ్లు మాత్రమే నడవడం వీలుతుంది. కానీ ఖమ్మంలోని మధ్యగేట్ వద్ద ఓ ట్రక్ ట్రాక్‌పై పరుగులు తీయడం కనిపించింది. ఇదేమిటని ఆరా తీస్తే మూడో లైన్ నిర్మాణ పనులకు కంకర, ఇతర సామగ్రి చేరవేసేందుకు ట్రక్‌కు ఉన్న టైర్లు తొలగించి రైళ్లకు ఉండే చక్రాలను బిగించినట్లు కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు చెప్పారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

కొత్త టెండర్.. పాత అంబులెన్స్‌లు !

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియా ఆస్పత్రిలో నూతన అంబులెన్స్‌ల ఏర్పాటుకు టెండర్ ఖరారైనా కాంట్రాక్టర్ పాత అంబులెన్స్‌లతోనే కాలం వెళ్లదీస్తున్నాడు. అధికారుల సహకారంతోనే ఇలా వ్యవహరిస్తున్నాడనే విమర్శలు వస్తున్నాయి. గతంలో అంబులెన్స్‌ల్లో ఏసీ లేకున్నా బిల్లులు మంజూరు చేయడం ఈ విమర్శలకు బలం చేకూరుస్తోంది. పాత అంబులెన్స్‌ల టెండర్ గత నవంబర్ రెండో వారంలో ముగియగా, నూతన అంబులెన్స్‌ల టెండరూ ఆ కాంట్రాక్టర్‌కే దక్కింది. దీంతో మూడు కొత్త అంబులెన్స్‌లు సమకూర్చుకునేందుకు 40 రోజుల గడువు కోరగా నాలుగు నెలలైనా మార్చలేదు. ఈ విషయమై ఆస్పత్రి డీవైసీఎంఓ మేరీకుమారిని వివరణ కోరగా... అత్యవసర సర్వీసు కావడంతో పాత వాహనాలకు 40 రోజులు గడువు ఇచ్చామన్నారు. దరఖాస్తు చేసుకోకుండా, పాత అంబులెన్స్‌లు నడిపిన నేపథ్యాన ఫిబ్రవరి, మార్చి నెలల బిల్లులు మంజూరవుతాయో, లేదోనని చెప్పడం గమనార్హం.

ఎండల వేళ.. మామిడి జాగ్రత్త

- బిందు సేద్యంతో తోటలకు నీరు అందిస్తే మేలు
- ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి మధుసూదన్



మామిడి రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యాన అధికారులు

ఖమ్మంవ్యవసాయం: రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతోంది. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యాన మామిడి తోటల రక్షణపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దాదాపు 40 వేల ఎకరాల్లో మామిడి సాగవుతుండగా, ఖమ్మం జిల్లాలో 30 వేలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 10వేల ఎకరాల్లో తోటలు ఉన్నాయి. ప్రస్తుతం మామిడి కాయ దశలో ఉండడం.. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున పంటను రక్షించుకుంటూ నాణ్యమైన దిగుబడులను సాధించేందుకు రైతులు తగిన యాజమాన్య పద్ధతలు పాటించాలని ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి ఎం.వీ.మధుసూదన్ సూచించారు. ఈమేరకు జిలాల్లోని పలు ప్రాంతాల్లో తోటలను పరిశీలించిన రైతులకు ఆయన చేసిన సూచనలు ఇలా ఉన్నాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- ప్రతీ మొక్కకు 6 – 8 డ్రిప్పర్లతో రోజుకు మూడు గంటలు చొప్పున బిందు సేద్యం ద్వారా నీరు అందించాలి.
- ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున నేలలో తేమ సమతుల్యతను కాపాడేందుకు ఉదయం గంటన్నర, సాయంత్రం గంటన్నర నీరు పెట్టాలి.
- డ్రిప్పర్లు చెట్టు కాండం నుండి 1.5 మీటర్ల దూరంలో ఉండాలి. డ్రిప్పర్ స్థానాన్ని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి.
- కాయ సైజు వేగంగా పెరిగేందుకు పదేళ్ల కంటే ఎక్కువ వయస్సు కలిగిన చెట్లకు 500 గ్రాముల యూరియా, 500 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి.
- త్రిప్స్(రసం పిల్చే చీడపీడలు) కనిపిస్తే లీటర్ నీటికి ఫిప్రోనిల్ 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.
- వాతావరణ మార్పు ప్రభావాలను తగ్గించడానికి మామిడి తోటకు ప్రతిరోజూ క్రమం తప్పకుండా నీరు పట్టడమే ప్రధానం.
- సాధారణంగా మామిడి తోటల వ్యాపారులు తక్కువ నీరు పెడుతుంటారు. లేదా రోజు విడిచి రోజు నీరు ఇస్తారు. తద్వారా పండ్లు రాలిపోయే ప్రమాదమున్నందున జాగ్రత్తలు వహించాలి.

పక్షుల కోసం ప్రత్యేకం !

ఖమ్మంలోని పార్కుల్లో నీటి పాత్రలు

ఖమ్మంలో పర్యావరణ పరిరక్షణ, మూగజీవాల సంరక్షణకు నగర పాలకసంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పార్కుల్లో వేలాదిగా మొక్కలు నాటగా.. పక్షులు సేద తీరుతున్నాయి. ఈ వేసవిలో పక్షులకు నీరు అందించేందుకు మొక్కలు, చెట్లకు పాత్రలు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల వద్ద ఉన్న చెట్లకు వీటిని బిగించి ప్రతిరోజు పాత్రలో నీరు పోయనున్నట్లు అధికారులు తెలిపారు.– ఖమ్మంమయూరిసెంటర్



మొక్కకు ఏర్పాటుచేసిన పాత్రలో నీరు పోస్తున్న సిబ్బంది



గోళ్లపాడు చానల్‌పై చెట్లకు పాత్రలు ఏర్పాటు చేస్తున్న కార్మికులు

సింగరేణి కార్మికులకు ఇన్సెంటివ్

- నెలలో 22 మస్టర్లు పనిచేసిన వారికే వర్తింపు
- ఫిబ్రవరి ఇన్సెంటివ్ నేడు చెల్లింపు



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఏడాది నిర్దేశించుకున్న వార్షిక లక్ష్యం 72 మిలియన్ టన్నులు సాధించడానికి గాను జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రతీ గనికి (ఓపెన్‌కాస్ట్, భూగర్భ) డిపార్ట్‌మెంట్ (సీహెచ్‌పీ)లకు కొంత టార్గెట్ నిర్ణయించింది. లక్ష్యాన్ని సాధించేందుకు గాను ఈ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు ఈ మూడు మాసాల్లో నెలకు కనీసం 22 మస్టర్లు పనిచేయాలని, అలా చేసిన వారికి మాత్రమే ఇన్సెంటివ్ ఇస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి నెలకు సంబంధించిన ఇన్సెంటివ్‌ను గురువారం ఆయా కార్మికులకు చెల్లించనుంది.

లక్ష్యాలు ఇలా..

ఆర్జీ–1లోని జీడీకే–11 ఇంక్లైయిన్ గనిలో 58,800 టన్నుల లక్ష్యానికి గాను 75,301 టన్నులు సాధించగా ఆ గనిలో పనిచేసే ఉద్యోగులకు రూ.2,500 స్పెషల్ ఇన్సెంటివ్ ఇవ్వనుంది. మణుగూరులోని ఓసీ–2లో 1,68,000 టన్నుల లక్ష్యానికి 2,08,580 టన్నులు సాధించగా ఆయా ఉద్యోగులు రూ. 2,200 చొప్పున, ఇల్లెందులో 1,96,000 టన్నుల లక్ష్యానికి 2,29,617 టన్నులు సాధించారు. ఆ గని ఉద్యోగులు రూ. 2,200 చొప్పున నేడు ఇన్సెంటివ్ అందుకోనున్నారు. అయితే గ్రేడ్‌ల ఆధారంగా ఈ ఇన్సెంటివ్ చెల్లిస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది.

మిగతా ఏరియాల్లో ఇలా..

- కొత్తగూడెం ఏరియాలోని జేవీఆర్‌ఓసీ–2లో 9,52,000 టన్నుల లక్ష్యానికి 10,13,430 టన్నులు (106 శాతం)సాధించగా, ఈ ఓసీలో పనిచేసే ఉద్యోగులు రూ.2,200 ఇన్సెంటివ్ అందుకోనున్నారు.
- భూపాలపల్లి ఏరియా కేటీకే 8 ఇంక్లైయిన్‌లో 16,800 టన్నుల లక్ష్యానికి 17,043 టన్నులు సాధించగా వీరికి రూ.1,200 ఇన్సెంటివ్ రానుంది.
- భూపాలపల్లి కేటీకే ఓసీ–2లో 1,40,000 టన్నుల లక్ష్యానికి 1,52,665 టన్నులు సాధించగా ఇక్కడి ఉద్యోగులకు రూ.1,700 ఇన్సెంటివ్ చెల్లించనుంది.
- మందమర్రి ఏరియాలోని కేకే5 గనిలో 16,800 టన్నుల లక్ష్యానికి 16,802 టన్నులు సాధించగా వీరికి రూ.1,200 ఇన్సెంటివ్ రానుంది.
- మందమర్రి ఏరియాలోని కేకే ఓసీలో 1,12,000 టన్నుల లక్ష్యానికి 1,31,173 టన్నులు సాధించగా, ఇందులో పనిచేసే కార్మికులకు రూ.1,200 ఇన్సెంటివ్ చెల్లించనుంది.
- శ్రీరాంపూర్‌లోని ఆర్కే–5 గనిలో 21,000 టన్నుల లక్ష్యానికి 21,478 టన్నులు సాధించగా ఇక్కడి ఉద్యోగులకు రూ.1,500 చొప్పున, అదే ఏరియాలోని ఆర్కే–6 ఇంక్లైయిన్‌లో 14,840 టన్నులకు 15,683 టన్నుల ఉత్పత్తి సాధించగా వీరికి రూ.1,700 చొప్పున ఇన్సెంటివ్ చెల్లించనుంది. రామకృష్ణాపూర్‌లోని రాంటెంకి గనిలో 14 వేల టన్నుల లక్ష్యానికి 14,694 టన్నులు సాధించగా అక్కడి ఉద్యోగులు రూ.1,200 చొప్పుప ఇన్సెంటివ్ అందుకోనున్నారు.